

ప్రజలకు కలెక్టర్ దీపావళి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - కాకినాడ



ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకుని దీపావళి పండుగ జరుపుకోవాలని, జిల్లా ప్రజలకు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు.అలాగే కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని రద్దు చేశామని, ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని కలెక్టర్ తెలిపారు.

విఓఎలకు కనీస వేతనాలేవీ..

- కాల పరిమితి రద్దు జిఒతో సరి
- 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తింపు లేదు
- పని ఒత్తిడి తగ్గింపు కోసం పోరాటం
- పట్టించుకోని ప్రభుత్వం


ఆందోళన చేస్తున్న విఓఎలు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకుల నుంచి రుణాలను ఇప్పించడం, కట్టిన పొదుపు, తీసుకున్న రుణాలను తిరిగి వాయిదా పద్ధతుల్లో వాటిని వసూలు చేసి బ్యాంకులకు జమ చేయడం వంటి పనులు ప్రధానంగా నిర్వహిస్తున్న విఓఎ(యానిమేటర్ల)లకు కనీస వేతనాలు కరవై, పని ఒత్తిడితో తీవ్ర స్థాయిలో సతమతమవుతున్నారు. 15 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత మూడేళ్ల కాల పరిమితి జిఒను ప్రభుత్వం ఇటీవలే రద్దు చేసింది.

జిల్లావ్యాప్తంగా సుమారు 1600 మంది డ్వాక్రా విఓఎలు గత 23 ఏళ్లుగా పని చేస్తున్నారు. గత టిడిపి హయాంలో వీరిని తొలుత కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు (సిసి)లుగా, ఆ తర్వాత డ్వాక్రా సిఎఫ్‌లుగా పిలిచేవారు. అనంతరం యానిమేటర్లుగా పిలిచేవారు. ప్రస్తుతం విఓఎలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. పొదుపు పనులే కాకుండా ప్రభుత్వానికి సంబంధించిన వివిధ రకాల సర్వేలు, ఇతర అనేక పనులు నిర్వహించాల్సి వస్తుంది. ప్రభుత్వం మూడేళ్ల కాల పరిమితి విధానాన్ని రద్దు చేసినప్పటికీ పెనం మీద నుంచి పొయ్యిలో తోసిన విధంగా నిర్ణయాలను తీసుకుంది. పనిలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా డిఆర్‌డిఎ పీడీ, ఎపిఎం, డిపిఎం, చివరకు సిసి గాని వీరిని తొలగించే అధికారం అప్పగించారు. ఇప్పటికే అధికారుల వేధింపులు తీవ్రమైన నేపథ్యంలో ప్రస్తుతం తొలగించే అధికారం వారి చేతుల్లోనే పెట్టడం శోచనీయమని పలువురు విఓఎలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.8 వేల వేతనంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.26 వేలు కనీస వేతనంగా ఇవ్వాలని ఏళ్ల తరబడి వీరు పోరాటాలు చేస్తున్నారు. అలాగే పని ఒత్తిళ్ల తగ్గించాలని, నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని ఉద్యమాలు సాగిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గత వైసిపి ప్రభుత్వం మాదిరిగానే వ్యవహరిస్తుందని విమర్శలు వినిపిస్తున్నాయి.

14 రకాల పనులు

డ్వాక్రా గ్రూపుల మహిళల వివరాలను మొబైల్ యాప్‌లో బుక్ కీపింగ్ చేయాలి. డిఆర్‌డిఎ కార్యాలయంలోని సిసి నిర్వహించే పనిని సైతం వీరే చేయాల్సి వచ్చింది. ఎంసిపి (మైక్రో క్రెడిట్ ప్లాన్) మ్యాపింగ్ చేయాలి. డ్వాక్రా సంఘాలకు రుణాలను ఇప్పించడంతోపాటు వారి వద్ద ఆన్‌లైన్ తంబు తీసుకోవాలి. అలాగే స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ రుణాలు, ఉన్నతి, ఉమెన్ ఎంటర్‌ప్రైజెస్(1 లక్ష రుణం) తదితర లోన్లు ఇప్పించాలి. సభ్యులందరికీ ఉద్యమ ఆధారం ఆన్‌లైన్ ద్వారా చేయాలి. సభ్యులు ఎవరైనా రుణాలు తీసుకున్న తర్వాత ఏ కారణం చేతనైనా తిరిగి చెల్లించకపోతే విఓఎలే బాధ్యత తీసుకుని వారిపై ఒత్తిడి తీసుకువచ్చి చెల్లించేలా చూడాలి. అలాగే సకాలంలో ప్రతినెలా రికార్డులను నమోదు చేయాలి. ఒకవేళ ఏదైనా కారణంతో రికార్డుల నమోదు పూర్తి కాకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తామని ఉన్నతాధికారుల నుంచి బెదిరింపులు వస్తున్నాయి. అలాగే మహిళా రైతులను గుర్తించి వారిని సంఘంగా ఏర్పాటు చేయాలి. ప్రతి నెల రెండు సంఘాలను ఏర్పాటు చేయాలని టార్గెట్ విధించారు. ఒకవేళ సంఘాలను ఏర్పాటు చేయకపోతే తొలగింపు, లేదా మెమోలు జారీ చేస్తున్నారు. వారు సమావేశాలకు హాజరు కాకపోయినప్పటికీ మెమోలు ఇస్తున్నారు. అరకు కాఫీ, గోటోస్ స్టాల్స్ పెట్టించే బాధ్యత వీరిదే. ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయకపోతే ఉన్నతాధికారుల నుంచి వేధింపులు ఎక్కువవుతున్నాయి. అలాగే రాజకీయ నాయకుల బహిరంగ సభలకు డ్వాక్రా మహిళలను తరలించే బాధ్యతను వీరికి అప్పగిస్తున్నారు. మరోవైపు యాప్‌ల పని భారం పెరిగిపోయింది. వివిధ సర్వేలను చేయిస్తున్నారు. సాసా, రోకోస్, విపిఆర్‌పి, అజీవక యాప్‌ల సర్వేలను ఎటువంటి శిక్షణా లేకుండా చేయమంటున్నారు. రోజంతా ఈ సర్వేలతో కుస్తీలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కిర్లంపూడి, తొండంగి, ఉప్పాడ, తాళ్లరేవులలో నాలుగు చోట్ల మహిళా మార్టులు ఉన్నాయి. మహిళా సంఘాలతోనే పెట్టుబడి పెట్టించి వచ్చిన లాభాలను వారికే ఇవ్వాల్సి ఉంది. కానీ ప్రస్తుతం లాభాలను ఎవరికి ఇవ్వడం లేదని ఆరోపణలు ఉన్నాయి. సరుకులను కొనుగోలు చేయించే బాధ్యతను విఓఎలకే అప్పగించారు. నెలకు కనీసంగా రూ. 30 వేలు సరుకులను కొనకపోతే ప్రతినెలా విఓఎల వేతనాల నుంచి రూ.5 వేలు కటింగ్ చేసేలా నిర్ణయాలు చేస్తున్నారు. రాజకీయ వేధింపులు మామూలుగానే ఉన్నాయి. గత ప్రభుత్వంలో పనిచేసిన జిల్లాలో సుమారు 200 మందిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలగించారు. ఇలా విఓఎలు అనేక ఒత్తిళ్ళ నడుమ అరకొర వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నారు.

కనీస వేతనాలు అమలు



రెండు దశాబ్దాల పైబడి విఓఎలుగా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం గుర్తించాలి. రూ.26 వేలు కనీస వేతనాన్ని తక్షణమే ప్రభుత్వం అమలు చేయాలి. పని ఒత్తిడి తగ్గించి, రాజకీయ,ఉన్నతాధికారుల వేధింపులను అరికట్టాలి. ప్రభుత్వం మారినప్పుడల్లా వీరిని అక్రమంగా తొలగిస్తున్నారు. ఇటువంటి విధానాలకు స్వస్తి పడకాలి.

-జి.బేబీరాణి, విఓఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు

ధరలతో ఇబ్బందులు



ప్రస్తుతం అన్ని రకాల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. కుటుంబం గడవాలంటే కష్టంగా మారింది. రోజంతా కష్టపడినా ప్రభుత్వం రూ.8 వేలు మాత్రమే వేతనంగా ఇస్తుంది. దీంతో తామంతా ఎలా బతకాలి. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి కనీస వేతనాలను అమలు చేసి పని ఒత్తిడిని తగ్గించాలి.

-గంగాభవానీ, వివిఎల సంఘం జిల్లా అధ్యక్షురాలు


కూలిపోయిన ఫ్యాన్సీ షాపు గోడ

సామర్లకోటలో కుండపోత

-27 హెక్టార్లలో పంట నీటి పాలు

-పల్లపు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి - సామర్లకోట

శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు సామర్లకోటలో కుండపోతగా వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో పంట పొలాలు ముంపున గురికాగా పట్టణంలోని 31వ వార్డు శివారు భాస్కర్ నగర్ కాలనీలో పలు ఇల్లు నీట మునిగాయి. పట్టణంలో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా ఆర్‌టిసి కాంప్లెక్స్, జయలక్ష్మి టాకీస్ రోడ్, రతన్ రాజు ఆసుపత్రి వీధి, తెలుకుల పుంత, తదితర పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గత 24 గంటల సమయంలో సామర్లకోటలో అత్యధికంగా 132.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఈ సీజన్లో ఇదే అత్యధిక వర్షపాతం కావడం గమనార్హం. పలు ప్రధాన కూడళ్లలో మునిసిపల్ డ్రెయిన్లు ఆక్రమణకు గురికావడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. గత 20 ఏళ్ల చరిత్రలో ముంపంటే ఎరగని స్థానిక 31వ వార్డు భాస్కర్ నగర్ కాలనీలోని పలు గృహాలు వర్షం నీటి ఇళ్లల్లోకి చేరి ఇబ్బందులు పడ్డారు. భాస్కర్ కాలనీ ముందు ఒక లేఅవుట్ వెంచర్ నిర్మించడంతో నిర్మించి కాలనీ ముందు డ్రెయిన్ నిర్మించి వదిలివేశారు. దీంతో కాలనీలోని పలు గృహాల్లోకి నీరు చేరింది. గృహపకరణాలు, మంచాలు తడిసిపోయాయి. తమ సమస్యపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో డ్రెయిన్ నిర్మించి ముంపు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. మండలంలోని హుస్సేన్‌పురం గ్రామంలో భూడి కృష్ణవేణికి చెందిన ఫ్యాన్సీ స్టోర్ వర్షం దాటికి నేలమట్టం అయింది. దీంతో షాపులో ఉన్న వస్తువులు ధ్వంసం అయ్యాయని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. సంఘటనా స్థలాన్ని గ్రామ టిడిపి అధ్యక్షుడు చల్ల బుజ్జి, తదితరులు సందర్శించారు. ఎంఎల్ఎ చినరాజప్ప దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ సాయం అందేలా చర్యలు తీసుకుంటామని బాధితురాలికి హామీ ఇచ్చారు. స్థానిక 11వ వార్డు వీర్రాజుపురంలో మూకర శివ ఇంటి గోడ కూలిపోయింది. ఆ సమయంలో ఎవరు అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.


ఇంటిలోకి చేరిన వర్షపు నీరు

27 హెక్టార్లలో పంట నష్టం

కుంబపోత వర్షంతో మండల పరిధిలో 27 హెక్టార్లలో వరి పంట నాశనం అయింది. హుస్సేన్‌పురంలో 4 హెక్టార్లు, సామర్లకోట పరిధిలో 8 హెక్టార్లు, పవర్ గ్రామంలో 3 హెక్టార్లు, వికె.రాయపురం గ్రామంలో 12 హెక్టార్లు వెరసి 27 హెక్టార్ల వరి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని మండల వ్యవసాయ అధికారి వంగపండు మురళీధర్ ప్రజాశక్తితో చెప్పారు. మరో రెండు మూడు రోజులు వర్షాలు కొనసాగితే పొట్ట దశలో ఉన్న తమ వరి పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంచాయతీ వర్కర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కాకినాడ రూరల్


ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు

ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ కాకినాడ రూరల్ మండల నూతన కమిటీ ఎన్నికైంది. పి.వీరభద్రం అధ్యక్షతన చీడిగలో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పి.వీరభద్రం, సిహెచ్.అజయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా వాసుపల్లి దుర్గాప్రసాద్, మోర్తా అప్పారావు, అంబటి రామకృష్ణ, సహాయ కార్యదర్శులుగా ఎస్.సూరిబాబు, పెంకే నాగేంద్ర, కమిటీ సభ్యులుగా టి.రాజా, గార్ల శ్రీను, ఏసు, బి.రాము, పి.వీరబాబు, రమేష్ ఎన్నికయ్యారు. భవిష్యత్‌లో మరి కొంతమందిని కో ఆప్ట్ చేసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సమావేశంలో కొన్ని తీర్మానాలను ఆమోదించింది. ఇంద్రపాలెం, రమణయ్యపేట, వాకలపూడి పంచాయతీల్లో కార్మికుల చెల్లించాల్సిన బకాయి జీతాలను వెంటనే చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, పోస్ట్ శాంక్షన్ రికార్డ్ పనులు అధికారులు త్వరగా పూర్తి చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి టి.రాజా మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన వలసపాకలలో జరిగే సిఐటియు రూరల్ మండల మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

రజకుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి


సమావేశంలో మాట్లాడుతున్న కోనేటి రాజు

రజకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనేటి రాజు, ప్రజా సంఘాల నాయకులు గుర్రాల అప్పారావు కోరారు. ఆదివారం స్థానిక ముప్పారపు అచ్చియమ్మ కల్యాణ మండపంలో రజక సంఘం సమావేశం పేట అప్పారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండలంలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం రజకులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని నాయకులు కోరారు. రజకులకు ఉన్న వృత్తి చెరువులను ఆధునికీకరించాలని, ధోబి ఘాట్లు నిర్మాణానికి స్థలాలు కేటాయించి, 90 శాతం రాయితీపై రుణాలు ఇవ్వాలని, ఆదరణ త్రీ పథకం వెంటనే ప్రారంభించాలని, రజకులకు ఉచిత విద్యుత్‌ను అందించాలని కోరారు. నవంబరు 1, 2 తేదీల్లో నెల్లూరులో జరిగే రజక సంఘం రాష్ట్రస్థాయి శిక్షణా తరగతుల్లో పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రజకులు వానపల్లి గంగాధర్‌రావు, వెదురుపాక చంటి, గుమ్మడి రాఘవ, వేములవలస రాజు, చోడవరపు బుజ్జి, ముంగళ్ళ సత్యనారాయణ పాల్గొన్నారు.

రత్నగిరిపై కార్తీకమాసం ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - శంఖవరం



ఈ నెల 22 నుంచి నెల రోజులపాటు జరిగే కార్తీక మాసం పురస్కరించుకుని రత్నగిరిపై ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్తీకమాసంలో వచ్చే ముఖ్యమైన పర్వదినాల్లో భక్తులు తాకిడి మరింత ఉంటుందనే అంచనాతో ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అదనపు సేవ టికెట్లు, కౌంటర్లు అదనపు డార్మెట్రీలు, వ్రత మండపాలు, విశ్రాంతి షెడ్లు దర్శనం, క్యూలైన్లు వద్ద భక్తులకు తాగునీరు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అపరి మితంగా పులిహార, దద్దోజనం వితరణ, పిల్లలకు పాలు, బిస్కెట్లు పంపిణీ వంటి సౌకర్యాలతో పాటు ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

జాతీయ సదస్సులో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కాకినాడ


విద్యార్థులతో డాక్టర్ నాయుడు

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల మత్స్య, ఆక్వా కల్చర్ విభాగానికి చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి సదస్సులో ఉత్తమ ప్రతిభను చాటారు. 'ఆక్వా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆపర్చునిటీస్-ఛాలెంజెస్' అనే అంశంపై తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన సదస్సులో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటుకున్నారని ఆదిత్య డిగ్రీ, పీజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. ఈ సదస్సులో తమ విద్యార్థులు పరిశోధనాత్మక ప్రాజెక్టులు, వ్యాపార ప్రణాళికలు ఆవిష్కరణల ద్వారా న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారని వివరించారు. ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంస పత్రాలను, జ్ఞాపికలను అందించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఫిషరీస్ విభాగాధిపతి డాక్టర్ కె.నరసింహమూర్తి, ఆధ్యాపకులు అభినందించారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - పిఠాపురం


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు సిద్ధు

సంక్షేమ వసతి గృహాల్లో నెలకున్న సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కె.సిద్ధు అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలు, సమస్యలపై అధ్యాయనం చేసే కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక ఎస్‌సి బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు అనారోగ్యాల భారిన పడుతున్నారని అన్నారు. ఇటీవల పార్వతీపురంలో ఇద్దరు విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయ్యిందని, కొంతమందికి పచ్చకామెర్లు వచ్చి చనిపోయారన్నారు. అధికారులు హాస్టల్లో సౌకర్యాలు మెరుగుపరిచి విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు పరిసరాలన్ని పరిశుభ్రంగా ఉండేలాగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ చిన్ని పాల్గొన్నారు.

సేవల్లో మేటి అప్పారావు

ప్రజాశక్తి - జగ్గంపేట


వంతెన హోల్‌ను శుభ్రం చేస్తున్న అప్పారావు

సమాజంలో మన కళ్లెదుటే ఎన్నో సమస్యలు కనిపిస్తాయి. అవి మనకెందుకులే అనుకునేవారు చాలా మంది ఉంటారు. కానీ ఇతను మాత్రం అలా అనుకోడు. తాను చేయగలిగిన పనైతే తప్పక చేసేస్తాడు. అతనే జగ్గంపేటకు చెందిన పాలిక అప్పారావు. రోజు వారీ కూలీ పని చేసుకునే అతను ప్రజా సమస్యలపై స్పందిస్తాడు. దీనిలోభాగమే ఆదివారం ఒక సంఘటన చోటుచేసుకుంది. ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి గోకవరం రోడ్డులోని పోలవరం కాలువ బ్రిడ్జిపై నీరు నిలిచిపోయింది. బ్రిడ్జికి ఉన్న హోల్స్ మూసుకుపోవడంతో నీరు నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆది గమనించిన అప్పారావు నీరు పోయేందుకు వీలుగా హోల్స్‌లో ఉండిపోయిన పూడికను శుభ్రం చేసి నీరు దిగువకు పోయేలా చేశాడు. దీంతో రోడ్డుపై నిలిచిపోయిన నీరంతా దిగువకు వెళ్లిపోయింది. అతను ఇదే తరహాలో ఎవరైనా ఏదైనా ప్రమాదం భారిన పడితే వారికి సేవలు చేసి ఆసుపత్రికి తరలించేందుకు సహకరిస్తాడు. ఇలా అతను కూలీ పని చేసుకుంటూనే అనేక సేవా కార్యక్రమాలు చేయడం అలవాటుగా మలుచుకున్నాడు. సేవల్లో మేటి అని అప్పారావు నిరూపించుకుంటూ పలువురి మన్ననలు పొందుతున్నాడు.


కరాటే పోటీల్లో రాణించిన విద్యార్థులు

ప్రజాశక్తి - కరప


విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

ఇన్విటేషన్ ఓపెన్ ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో మండలంలోని యండమూరి, నడకుదురు గ్రామాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటుకున్నారు. 6 గోల్డ్ మెడల్స్, 3 సిల్వర్ పథకాలు సాధించినట్లు కోచ్ యు.లోవరాజు తెలిపారు. కాకినాడలో కరాటే మాస్టర్ ఎన్.సత్తిబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఈ పోటీలు నిర్వహించారు. యండమూరికి చెందిన సిరి, హన్సిక ఫైటింగ్ విభాగంలో సిల్వర్ పథకాలు గెలుచుకున్నారు. నడకుదురు గ్రామానికి చెందిన మణికంఠ, యశ్వంత్, రామ్‌చరణ్, అభిజిత్, సాయి ఈశ్వర్, శ్రీహర్ష కట్ట కుమిటే విభాగంలో గోల్డ్ మెడల్స్ సాధించారు. అదే విభాగంలో మనోహర్ సిల్వర్ పథకం పొందాడు.

కార్టూ'నిజం'



ఐద్వా రాష్ట్ర కమిటీలో ముగ్గురికి ప్రాతినిధ్యం

ప్రజాశక్తి - కాకినాడ



ఈ నెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో జరిగిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర మహాసభల్లో ఎన్నికైన రాష్ట్ర కమిటీలో జిల్లా నుంచి ముగ్గురు ఎన్నికయ్యారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.భూలక్ష్మి, కె.వరలక్ష్మి రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం వారు ఒక ప్రకటనను విడుదల చేశారు. రాష్ట్ర మహాసభలో మహిళలపై జరుగుతున్న హింస, మద్యం, డ్వాక్రా, హైడ్రో, సూపర్ సిక్స్, మెడికల్ కాలేజీలు, ట్రోలింగ్ వంటి అంశాలపై చర్చించి తీర్మానాలను ఆమోదించినట్లు తెలిపారు. 57 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నిక అయిందని, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా కె.శ్రీదేవి, వి.సావిత్రి ఎన్నికయ్యారని తెలిపారు.

సువార్త రాజుకు ఘన సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట


సువార్తరాజు దంపతులను సత్కరిస్తున్న సంఘస్తులు

ఆంధ్రప్రదేశ్ తెలుగు బిషప్స్ కౌన్సిల్ అధ్యక్షుడిగా ఎన్నికైన స్థానిక ట్రూ గాస్పల్ బాప్టిస్ట్ చర్చ్ సంఘ కాపరి ఈలి సత్యసువార్తరాజును ఆదివారం ట్రూ గాస్పల్ బాప్టిస్ట్ చర్చిలో సంఘ పెద్దలు, సంఘ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నమ్మకమైన సేవకు, నిస్వార్థమైన ప్రేమకు నిదర్శనంగా నిలిచిన వ్యక్తి సువార్తరాజు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి పిట్టా జానకి రామారావు పాల్గొన్నారు.

రోప్ వే బ్రిడ్జి పరిశీలన

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ నుంచి పాతకోరంగి గ్రామాల మధ్య ఉన్న రోప్ వే బ్రిడ్జిని ఎంపి హరీష్‌మాధుర్ ఆదివారం పరిశీలించారు. లోక్‌సభ మాజీ స్పీకర్ జిఎంసి బాలయోగి నిర్మించిన ఈ 'రోప్ వే బ్రిడ్జి' పాడైయింది. ఈ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టేందుకు ఇప్పటికే ఎంపి నిధులు రూ.20 లక్షలు కేటాయించారు. అయితే ఆ నిధులు సరిపోకపోవడంతో బ్రిడ్జి మరమ్మతు పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు సూచననతో ఎంపి హరీష్‌మాధుర్ ఆదివారం బ్రిడ్జిని పంచాయతీరాజ్ అధికారులతో కలిసి పరిశీలించారు. గతంలో కేటాయించిన నిధులు సరిపోలేదని, మరో రూ.40 లక్షలు అవసరమని అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పూర్తి స్థాయిలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలంటే రూ.13 కోట్లు అవసరం ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఎంపిని కలిసి పాతకోరంగి నుంచి పటవల వరకూ కాలువగట్టును అభివృద్ధి చేయాలని కోరారు. ఈ పర్యటనలో టిడిపి మండల అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, మాజీ జడ్‌పిటిసి పొన్నమండ రామలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు కొప్పిశెట్టి బాబి, వెంటపల్లి ఉమామహేశ్వరి, కొప్పిశెట్టి చంటి, జవ్వాది తాతాజీ, కోడూరి ఆదినారాయణ, పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాస్, డిఇ శ్రీనివాస్, ఎఇ ఉమాశంకర్ పాల్గొన్నారు.

జిమ్ ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనంలో స్థల వివాదంతో తొలగించిన జిమ్ము పరికరాలను తిరిగి ఏర్పాటు చేయాలని ఎంఎల్ఎ పంతం నానాజీని వాకర్స్ సంఘ అధ్యక్షులు ఆడబాల రత్నప్రసాద్ కోరారు. ఆదివారం రమణయ్యపేటలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎంఎల్ఎకు ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. అధికారులతో మాట్లాడి జిమ్ ఏర్పాటు చేస్తానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రంభాల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు, బుద్ధరాజు సత్యనారాయణరాజు, ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

పేదలకు బాణసంచా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

దీపావళి పండగ సందర్భంగా పలువురికి అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బాణసంచా సామాగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నరసాపురం సీనియర్ సివిల్ న్యాయమూర్తి గింజాల గంగరాజు పాల్గొని బాణసంచా సామాగ్రిని పేదలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది యనమల రామం, కొళ్ళుబోయిన సూరిబాబు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రేలంగి బాపిరాజు, రాజా పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

మహిళకు రూ.15 వేల సాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న ఒక మహిళలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.15 వేల సాయం ఆదివారం అందజేశారు. పి గన్నవరం మండలం ముక్తేశ్వరం గ్రామానికిచెందిన జనిపల్లి సంధ్య భర్తను కోల్పోయి పిల్లలతో ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతోంది. ఈ విషయం తెలుసుకున్న మంత్రి సుభాష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.15 వేలు చెక్కును తక్షణ సహాయంగా బాధిత కుటుంబానికి అందజేశారు. ఇద్దరు పిల్లలకు చదివించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని సూచించారు. పిల్లల చదువుకు తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి సహాయానికి మహిళ కృతజ్ఞతలు తెలిపింది.



రామచంద్రపురం పట్టణంలో వెలవెలబోతున్న దుకాణాలు

అంతంత మాత్రంగానే బాణసంచా విక్రయాలు

ప్రజాశక్తి- రామచంద్రపురం

దీపావళి బాణసంచా ధరలు అమాంతం పెరగడంతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. దీంతో ఆదివారం అమ్మకాలు అంతంత మాత్రమే కొనసాగాయి. దీపావళి అనగానే దీపాలతో పాటు బాణసంచా టపాసులు కాల్చుకునేందుకు పిల్లలు పెద్దలు ఎంతో ఉత్సాహం చూపుతారు. దీంతో ప్రతి ఇంటా బాణాసంచా కాల్చేందుకు అధిక మొత్తంలోనే ఖర్చు పెడతారు. ప్రతి సంవత్సరం దీపావళి బాణసంచా మందులు ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ఈ ఏడాది మరింత ధరలు మన్నడంతో కొనుగోలుదారులు అంతంత మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు ఆదివారం, సోమవారం మాత్రమే అమ్మకాలు కొనసాగించాలని ప్రభుత్వం నిబంధనం పెట్టడంతో వినియోగదారులు ఈ రెండు రోజులపాటు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. అయితే ఆదివారం ఉదయం వర్షం రావడంతో బాణసంచా దుకాణాలకు వెళ్లేందుకు జనం సుముఖత చూపలేదు. సాయంత్రం అమ్మకాలు అంతంత మాత్రమే ఉన్నాయని వ్యాపారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక మిగిలిన ఒక్కరోజులో ఎంతవరకు అమ్మకాలు కొనసాగుతాయి అనేది వేచి చూడాల్సి ఉంది.

కపిలేశ్వరపురం: దీపావళి సందర్భంగా ఆదివారం కపిలేశ్వరపురం మండలంలోని అంగర, టేకి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన బాణసంచా దుకాణాలు వెలవెలబోయాయి. బాణాసంచా దుకాణదారులకు అధికారులు రెండు రోజులు మాత్రమే తాత్కాలిక లైసెన్సులు జారీ చేశారు. దీంతో రూ. లక్షల్లో పెట్టిన పెట్టుబడి వస్తుందా అనే ఆందోళనలో దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు వాతావరణం బెంబేలెత్తిస్తోంది. మరోవైపు గత ఏడాది కంటే బాణాసంచా 3 శాతం పెరగడంతో వినియోగదారులకు ఇబ్బందిగా మారిందని దుకాణదారులు తెలిపారు. కనీసం పెట్టిన పెట్టుబడి వస్తే చాలు అన్న ఆలోచనలో ఉన్నట్లు దుకాణదారులు తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

ప్రజాశక్తితో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ గణపతి



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటుందని, వారికి వెన్నుదన్నుగా జిల్లా పరిశ్రమల కేంద్రం నిలుస్తోందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సిహెచ్.గణపతి అన్నారు. జిల్లాలో సుమారు 13,681 వరకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహ పరిశ్రమలు, నూనె శుద్ధి, టైల్స్ తయారీ, రైస్ మిల్లింగ్, ఆహార శుద్ధి, ప్యాకేజింగ్, వ్యవసాయ ఆధారిత, మత్స్య ఆధారిత ఉత్పత్తులు, ఆటోమొబైల్, ఇంజనీరింగ్ ఫ్యాబ్రికేషన్ మొదలగు రంగాలలో స్థాపించి ఉన్నాయన్నారు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతిపై ఆయన 'ప్రజాశక్తి' ముఖాముఖిలో పలు అంశాలను వివరించారు.

2025-2026 సంవత్సరంలో పరిశ్రమల లక్ష్యం ఎంత..?

జిల్లాలో ఇప్పటివరకు అన్ని పరిశ్రమలు స్థాపింపబడి సుమారు 50 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. 61 పెద్ద, భారీ తరహా పరిశ్రమల ద్వారా మరో 38,500 మందికి ఉపాధి కల్పిస్తూ స్థూల దేశీయోత్పత్తిలో తమ వంతు భాగాన్ని అందిస్తున్నాయి. సిఎం నిర్దేశించిన దాని ప్రకారం ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త అనే లక్ష్యంతో జిల్లా పరిశ్రమల కేంద్రం వివిధ కేంద్ర, రాష్ట్ర పథకాలు అమలు పరిచేందుకు కృషి చేస్తుంది.

పిఎం ఉపాధి కల్పన పథకంతో ఎంత మేలు..?

ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా గ్రామాలు, పట్టణాల్లోని నిరుద్యోగ యువత వివిధ పారిశ్రామిక వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకొనేందుకు వాళ్ళు తీసుకున్న రుణాలపై 35 శాతం, 25 శాతం సబ్సిడీ కల్పిస్తున్నారు. అలాగే గత సంవత్సరం, ప్రస్తుత సంవత్సరం కలిపి మొత్తం 221 మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు.

పిఎం విశ్వకర్మ పథకం లక్ష్యం..?

పిఎం విశ్వకర్మ పథకం ద్వారా వివిధ కుల వృత్తుల వారికి లబ్ధి చేకూర్చే విధంగా కృషి చేస్తున్నాము. వాటికి సంబంధించి 722 దరఖాస్తులను ఇప్పటికే స్వీకరించాము.

ర్యాంప్ పథకం అంటే ఏమిటి..?

ఎంఎస్ఎంఇల పని తీరును మెరుగు పరచడం, అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ అనే పథకాన్ని ప్రకటించింది. మన రాష్ట్రంలో ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పర్యవేక్షణలో ఉద్యమ్ అవగాహన సదస్సులు, జెడ్ రిజిస్ట్రేషన్ సదస్సులు, ఎంఎస్ఎంఇ కాంపిటీటివ్ లేయిన్ స్కీమ్ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఎంఎస్ఎంఇల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న వివిధ ప్రోత్సాహకాలు, వాటికి ఉండే ప్రయోజనాలు వివరించడమే ఈ రాంప్ పథకం లక్ష్యం.

ఉద్యమ్ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారా..?

జిల్లాలో ఇప్పటి వరకు 27 ఉద్యమ్ అవగాహన సదస్సులు వివిధ మండలాల్లో నిర్వహించాం. ఇంకా పలు ప్రాంతాలలో ఏర్పాటు చేస్తాం. వీటి వల్ల వివిధ రకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందేందుకు, బ్యాంకు రుణ సదుపాయాలు, ఎంఎస్ఎంఇల డిలేడ్ పేమెంట్లను సమాధాన పోర్టల్‌తో అనుసంధానించడం ద్వారా కలిగే ప్రయోజనాలను ఈ సందర్భంగా వివరిస్తున్నాము.

నూతన పరిశ్రమల స్థాపనకు చర్యలు..?

జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, నిబంధనలను క్రమబద్ధీకరించడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, వ్యాపారాల్లో స్నేహపూర్వక వాతావరణన్ని సృష్టించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విధానం-2024-29, ఎంఎస్ఎంఇ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పాలసీ-2024-29, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ-2024-29లను అమలు చేస్తుంది. ఈ నేపథ్యంలో పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుంది.



ఏకగవాక్ష విధానంలో దరఖాస్తులను స్వీకరిస్తున్నారా..?

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఏక గవాక్ష విధానం కింద ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి అందిన దరఖాస్తులను త్వరితగతిన అనుమతులు కల్పించేలా కలెక్టర్ సూచనలు మేరకు కలిసి పని చేస్తున్నాం. పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా కృషి చేయడం జరుగుతుంది. జిల్లాలో పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుంది. కాకినాడ జిల్లా భౌగోళిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ఎటువంటి పరిశ్రమలను స్థాపిస్తే ఉపయుక్తంగా ఉంటుందో వాటిని ప్రోత్సహించడం జరుగుతుంది.

సంత రహదారిలో ట్రాఫిక్ అవస్థలు

ప్రజాశక్తి - పెద్దాపురం



ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారులు

స్థానిక కుమ్మర వీధిలోని సంత మార్కెట్ రహదారిలో సంత జరిగే ప్రతి ఆదివారం తీవ్ర ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు, కొనుగోలుదారులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సంత మార్కెట్‌ను ఆనుకునే కుమ్మరి వీధి సెంటర్ నుంచి సామర్లకోట-ప్రత్తిపాడు రహదారికి వెళ్లే రోడ్డు ఉండటంతో ప్రతిరోజు వందలాది వాహనాలు ఈ రహదారి మీదిగానే వెళుతుంటాయి. దీనికి తోడు ఈ రహదారిలో అనేక పరిశ్రమలు, మండల పరిధిలోని ఏటిపట్టు గ్రామాలు ఉండటంతో ప్రతిరోజు వాహనాలపై వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఈ సంత మార్కెట్ ఎదురుగానే శ్మశానం ఉండటంతో ఆదివారం రోజున శ్మశానానికి వెళ్ళవలసి వస్తే ఈ ట్రాఫిక్ వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రోజున ఈ రహదారిని ఆనుకుని సంత వ్యాపారాలు జరగడంతో ట్రాఫిక్కుకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అధికారులు దీనిని గమనించి ప్రతి ఆదివారం ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులకు నిరాశ : కురసాల

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



మీడియాతో మాట్లాడుతున్న కురసాల

కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులతోపాటు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర నిరాశే ఎదురైందని మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలు ముందు ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి అమలు చేయలేక పోయిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలలో విద్య, వైద్య రంగాలతో పాటు అన్ని రంగాలను గాలికి వదిలేసిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డి ఎ ప్రకటించి పండగ చేసుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడే కార్పొరేట్ ఆసుపత్రులు వారం రోజులుగా ఆరోగ్యశ్రీ వైద్య సేవలను నిలిపివేసినప్పటికీ ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోవడం దారుణమన్నారు. రైతులకు ఇస్తానన్న బీమా డబ్బును ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. అలాగే ప్రయివేట్ విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఫీజ్ రియంబర్స్మెంట్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామాలలో పిహెచ్‌సి, సిహెచ్‌సి డాక్టర్లు 15 రోజులుగా విధులకు వెళ్లకుండా సమ్మె చేస్తున్నారని, దీంతో గ్రామ స్థాయిలో ప్రజలకు ఆరోగ్య అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రయివేట్ పరం చేసి ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు అందకుండా చేయడం ప్రజల హక్కులను కాలరాయిడమేనన్నారు. ఫన్షనర్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పి మాజీ ఉద్యోగులను మోసం చేశారని అన్నారు. గతంలో వేసిన పిఆర్‌సి కమిషన్ ఛైర్మన్‌ని వెలగొట్టి పిఆర్‌సి ప్రస్తావన లేకుండా ఉద్యోగులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులందరూ ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో షాపుల వద్ద వ్యాపారులు

వర్షంతో కుదేలైన బాణసంచా వ్యాపారులు

ప్రజాశక్తి - సామర్లకోట, ఏలేశ్వరం

పలు చోట్ల కురిసిన కుండపోత వర్షంతో బాణసంచా వ్యాపారులు దిక్కుతోచని స్థితిలోకి నెట్టబడ్డారు. సామర్లకోట పట్టణంలోని బడేలమ్మ చెరువు ఎదురుగా రోడ్డుకి ఇరువైపులా 14 బాణసంచా దుకాణాలు ఏర్పాట్లు చేశారు. దీపావళికి ఒకరోజు ముందు కురిసిన భారీ వర్షంతో బాణసంచా వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే ఏలేశ్వరంలో కురిసిన వర్షం బాణాసంచా వ్యాపారులకు తీవ్ర నిరాశను మిగిల్చింది. శనివారం సాయంత్రం టెంట్లు వేసి మందు గుండు సామాగ్రిని తరలించుకున్న వ్యాపారులకు ఆదివారం వచ్చి చూసేసరికి ఏర్పాటు చేసిన టెంట్లు వర్షం ప్రభావంతో కూలిపోయాయి. వర్షం పడడంతో లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని, వర్షం ప్రభావంతో తీవ్రంగా నష్టపోయామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.

దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట

దీపావళి పండుగను ప్రజలు సురక్షితంగా జరుపుకోవాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప కోరారు. ఆదివారం ఆయన సామర్లకోటలోని దీపావళి బాణసంచా విక్రయ దుకాణాలను పరిశీలించారు. చిరు వ్యాపారుల కోసం త్వరలోనే ఒక మార్కెట్ నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. ఈ పర్యటనలో కూటమి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, మలిరెడ్డి దుర్గాప్రసాద్, భీమేశ్వర ట్రస్ట్ బోర్డు మెంబర్ తాతపూడి అరుణ్‌వంశీ, మండల టిడిపి అధ్యక్షులు ముసిరెడ్డి శ్రీరాములు, మండల తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - జగ్గంపేట



50 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మండలంలోని కాండ్రావులపల్లి జడ్‌పి హైస్కూల్లో చదువుకున్న పూర్వపు విద్యార్థులు ఆదివారం 65 ఏళ్ల వయసులో 15 ఏళ్ల యువకుల్లా సందడి చేశారు. 1970 - 75 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు కాండ్రావులపల్లి కళ్యాణ మండపంలో ఆదివారం ఆత్మీయ కలయికగా కలుసుకున్నారు. సుమారు 50 ఏళ్ల తరువాత కలుసుకుని గత తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వృద్ధాప్య దశకు చేరుకుని ఎక్కడెక్కడో స్థిర పడిన వారు సైతం వచ్చి ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఉత్సాహంగా గడిపారు. అనంతరం పలువురిని సాలువాలు, పూలమాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాండ్రావులపల్లి నీటి సంఘం అధ్యక్షులు కంటే రామారావు, సర్పంచ్ పిట్ట సుగుణ రావు, షేక్ జిన్నా, కొంగర వెంకటనారాయణ, ఏలేటి పద్మ ప్రసాద్, జల్లంగి వీరభద్రరావు, కష్ణ ప్రసాద్, వెంకట్రావు, దేవ గుప్తాపు, వెంకట్రావు, హై స్కూల్ హెచ్ఎం తాతపూడి వెంకటరమణ తో పాటు పూర్వ విద్యార్థులు 75 మంది పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న యాదవ సంఘీయులు


చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలి

ప్రజాశక్తి - యానాం

చట్టసభల్లో యాదవులకు తగిన ప్రాతినిధ్యం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యాదవ మహాసభ కోరింది. ఆదివారం స్థానిక అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో ఎపి అఖిల భారతీ యాదవ మహాసభ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు, పుదుచ్చేరి అధ్యక్షుడు మట్టా సురేష్ యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జాతీయ ప్రధాన కార్యదర్శి నుర్తు నరేంద్రయాదవ్ మాట్లాడుతూ 70 ఏళ్లుగా 50 శాతంగా ఉన్న బిసి జనాభాకు సమానమైన రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా పాలకులు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా శాస్త్రీయంగా నిర్ధారణ చేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణాలో సైతం స్థానిక సంస్థల్లో 46 శాతం రిజర్వేషన్లు అమలుకు నిర్ణయం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 80 లక్షలుగా ఉన్న యాదవులకు వచ్చే ఎన్నికల్లో 25 అసెంబ్లీ, 5 ఎంపి సీట్లు కేటాయించాలని తీర్మానించారు. యాదవ కార్పోరేషన్‌కు రూ.2 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించాలని, అమరావతిలో యాదవుల వసతికోసం యాదవభవన్ నిర్మాణం, పశువులకాపరుల పిల్లల విద్యకై గురుకుల పాఠశాల, టిటిడి దేవస్థానంలో యాదవులకు మఠం నిర్మాణం, పాలక మండలిలో సభ్యుడిగా నియామకం చేయాలని తీర్మాణించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి రామారావు, నాయకులు రామచంద్రయాదవ్, కుండల సాయికుమార్ యాదవ్, కోన గురవయ్య, పెనుగొండ దుర్గబాబు, మట్టా పుల్లారావు, పుట్టి ఏడుకొండలు, ఏసుబాబు, మొండి సత్యనారాయణ, వీరబాబు, గంగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గిరిబాబును కలిసిన శివకుమార్

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



గిరిబాబుకు కృతజ్ఞతలు చెబుతున్న శివకుమార్

వైసిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును ఆర్‌టిఐ వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన లింగంపల్లి శివకుమార్ ఆదివారం కిర్లంపూడిలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గిరిబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం



అన్నదానాన్ని పర్యవేక్షిస్తున్న ఎసి విజయలక్ష్మి

స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆదివారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలతో అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో వేద పండితులు ఐవి.ప్రసాద్‌శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆసాదులు రాయి నాని, రామ చంద్రప్రసాద్, సిబ్బంది ఎస్.రమణ, జి.క్రాంతి, శివ, వరహాలు సేవలందించారు.



జొన్నాడ ఫ్లైఓవర్ దుస్థితి

నిలిచిన జొన్నాడ ఫ్లయ్‌ఓవర్ నిర్మాణం

- ప్రస్తుత కాంట్రాక్ట్ సంస్థ రద్దు
- మళ్లీ టెండర్లకు పిలుపు
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు
- త్వరితగతిన పూర్తిచేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఆలమూరు

ఎన్నో ఏళ్ల నుంచి నత్తనడకన సాగుతున్న ఆలమూరు మండలం జొన్నాడ ఫ్లయ్‌ఓవర్ నిర్మాణ కాంట్రాక్ట్ రద్దు అయింది. ఫ్లయ్‌ఓవర్ నిర్మాణ పనులు జాప్యం వల్ల వాహనదారులు పడరానిపాట్లు పడుతున్నారు. దీనిపై కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాదుర్‌లు ఎన్నిసార్లు జిల్లా స్థాయిలో సమీక్ష జరిగినప్పటికీ ఫలితం లేకపోయింది. చివరికి ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. పని చేయని ఆ కాంట్రాక్ట్ సంస్థను రద్దు చేయాలని సిఎం ఆదేశించారు. దీనిపై ఆ కాంట్రాక్ట్ సంస్థ కు నోటీసు ఇవ్వగా ఈ నిర్మాణ పనుల నుంచి ఆ సంస్థ తప్పుకోవడానికి సిద్ధమని లిఖిత పూర్వకంగా రాసిచ్చింది. దీంతో ఎలాంటి లీగల్ సమస్య లేకుండా వచ్చే నెలలో మళ్లీ టెండర్లు పిలిచి వేరే కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించడానికి నేషనల్ హైవే అథారిటీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ ఫ్లయ్‌ఓవర్ ఫిల్లర్స్ పూర్తయ్యాయి. గడ్డర్స్ కూడా నిర్మించి సిద్ధంగా ఉంచారు. వాటిని పిల్లర్స్‌పై పెట్టి స్లాబ్ వేస్తే సరిపోతుంది. అదేవిధంగా అప్రోచ్ రోడ్ వాల్ కి అవసరమైన కాంక్రీట్ దిమ్మలు కూడా జొన్నాడ శివాలయం ఆవరణలో తయారుచేసి సిద్ధంగా ఉన్నాయి. పాత కాంట్రాక్ట్ సంస్థకు ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లులు చెల్లించి కొత్త కాంట్రాక్ట్ కొనసాగించడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఏళ్ళ తరబడి ఈ ఫ్లయ్‌ఓవర్ నిర్మాణం పూర్తి చేయకపోవడం వల్ల వాహనదారులు ఇటుగా వెళ్లడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 2022 సెప్టెంబరు 22న జాతీయ రహదారులు, రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రాజమహేంద్రవరం వచ్చి ఈ ప్యాకేజీకి శంకుస్థాపన చేశారు. ఇదే ప్యాకేజీ లో ఉన్న మోరంపూడి ఫ్లయ్‌ఓవర్ ప్రారంభించి ఏడాది అవుతున్న నిర్మాణం మాత్రం ముందుకు సాగలేదు. కొత్త కాంట్రాక్ట్ సంస్థ ద్వారా పనులు వేగవంతంగా జరగడానికి అధికార యంత్రాంగం చర్యలు చేపడతారని ప్రయాణికులు కోరుతున్నారు.

న్యాయం చేయాలని ఎంఎల్ఎకు వినతి

ప్రజాశక్తి - కరప



మహిళలతో మాట్లాడతున్న ఎంఎల్ఎ నానాజీ

మండలంలోని కూరాడ గ్రామానికి చెందిన డ్వాక్రా రుణాల వ్యవహారంలో జరిగిన అవకతవకలపై విచారణ చేసి న్యాయం చేయాలని పలువురు మహిళలు ఎంఎల్ఎ పంతం నానాజీని కోరారు. ఎంఎల్ఎ కార్యాలయంలో ఆదివారం ఎంఎల్ఎను డ్వాక్రా మహిళలు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రుణాలు చెల్లింపులు చేశామన్నా బ్యాంకు నమోదు కాలేదని, బిసి పాయింట్ వద్ద చెల్లించిన సొమ్ములకు చేతితో రాసిన రసీదులు మాత్రమే ఇచ్చారన్నారు. ఇందుకు కారుకులైన వారి వద్ద నుంచి సొమ్ములు రికవరీ చేసి లబ్ధిదారులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కరిస్తానని ఎంఎల్ఎ వారికి హామీ ఇచ్చారు.